మార్చి 2 నుండి 8వ తేదీ వరకు

పిఠాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయ బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర - తిరుపతి: కాకినాడ జిల్లా పిఠాపురం శ్రీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో మార్చి 2 నుండి 8వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. మార్చి 2న సాయంత్రం 6 గంటలకు మృత్సంగ్రహణం, అంకురార్పణ నిర్వహిస్తారు.మార్చి 3న ఉదయం 8 నుండి 8.45 గంటల వరకు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. సాయంత్రం 6 నుండి రాత్రి 9 గంటల వరకు శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. మార్చి 4న సాయంత్రం 6.30 నుండి రాత్రి 8.30 గంటల వరకు శ్రీవారి గరుడ వాహన సేవ జరుగనుంది. మార్చి 5, 6వ తేదీల్లో సాయంత్రం 6.30 నుండి రాత్రి 7.30 గంటల వరకు ఊంజల్‌సేవ చేపడతారు. మార్చి 7న ఉదయం 10.30 నుండి 11.15 గంటల వరకు చక్రస్నానం, సాయంత్రం 5 నుండి రాత్రి 8 గంటల వరకు ధ్వజావరోహణం నిర్వహించనున్నారు. మార్చి 8న సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల వరకు పుష్పయాగం నిర్వహిస్తారు.

రెక్టార్ పదవి దళితులకు కేటాయించాలి

రాష్ట్ర హెూంమంత్రికి వైసీపీ విద్యార్థి విభాగం వినతి

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : ఎస్వీ యూనివర్సిటీ రెక్టర్ పదవిని దళితులకు కేటాయించాలని వైఎస్ఆర్సిపి విద్యార్థి విభాగం ఎస్వీ యూనివర్సిటీ అధ్యక్షులు ప్రేమ్ కుమార్ రాష్ట్ర హెూం శాఖ మంత్రి తానేటి వనితకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం తిరుపతి పద్మావతి అతిథిగృహంలో ఆమెను మర్యాదపరంగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ రెక్టార్ పదవిలో ఉన్న శ్రీకాంత్ రెడ్డి ఇటీవల పదవి విరమణ చేశారన్నారు. ఖాళీ అయినా రెక్టర్ పదవిని దళితులకు కేటాయించి ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి కలలు కన్నా సామాజిక న్యాయాన్ని బలపరచాలని కోరారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అన్ని సామాజిక వర్గాల వారికి న్యాయం చేయాలని అధికారులకు సూచనలు చేశారని తెలిపారు. ఇదే క్రమంలో విశ్వవిద్యాలయాల్లో కూడా సామాజిక న్యాయం పాటించాలని ఉపకులపతులకు చూపించారన్నారు. కానీ ముఖ్యమంత్రి జగన్ ఆశించిన విధంగా కాకుండా, గతంలో ఎస్ యూనివర్సిటీలో దళితులకు అన్యాయం చేస్తూ రెక్టాక్ పదవిని అగ్రవర్ణాలకు కేటాయించారన్నారు. ఆ సమయంలో వై.యస్.ఆర్ విద్యార్థి విభాగం తరపున ఆందోళనలు చేపడితే ఆ రోజు ఉపకులపతి తదిపరి అవకాశం దళితులకు ఇస్తాం అని హామీ ఇచ్చారని తెలిపారు. ఆ హామీ మేరకు ఇప్పుడు ఖాళీ అయిన రెక్టర్ పదవిని దళితులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. రెక్టర్ పదవి ఖాళీ అయి సుమారు 2 నెలలు అవుతున్నా ఇప్పటికీ ఆ పదవిని భర్తీ చేయకపోవడంలో అంతర్యం ఏమిటో తెలియజేయాల్సిన బాధ్యత కూడా అధికారులపై వుందన్నారు. అధికారులు వెంటనే స్పందించి రెక్టార్ పదవిని దళితులకు కేటాయించే విధంగా నిర్ణయం తీసుకుని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయాలను నిలబెట్టాలని కోరారు. అనంతరం రాష్ట్ర హెూం మంత్రి తానేటి వనితను దళిత విద్యార్థి సంఘ నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు నరేష్, ముని, హేమ్చంద్, అక్బర్, చరణ్, గౌతమ్, చందు, పవన్, మోహన్, రాకేష్, పవన్, పాల్గొన్నారు.

'యువగళం'లో వైసీపీ, టీడీపీ మధ్య వివాదం

విశాలాంధ్ర-ఏర్పేడు: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన 'యువగళం' పాదయాత్రలో బుధవారం తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం మల్రిమంద గ్రామం వద్ద వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య వివాదం చోటు చేసుకుంది. యువగళం పాదయాత్రలో అలజడి సృష్టించేందుకు మల్రిమంద సమీపంలో వైసీపీ కార్యకర్తలు కొందరు తెలుగుదేశం పార్టీ నేతలకు వ్యతిరేకంగా ముద్రించిన కరపత్రాలు వెదజల్లారు. దీంతో ఇరుపార్టీలకు చెందిన కార్యకర్తల మధ్య వివాదం జరిగింది. పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని కరపత్రాలు వెదజల్లిన వైసీపీ కార్యకర్తలను సమీపంలోని పాఠశాల గదిలోకి తీసుకెళ్లి తాళాలు వేశారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అక్కడ వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో వివాదం సద్దుమణిగింది. వైసీపీ వారు ఉద్దేశ్య పూర్వకంగా వివాదం సృష్టించడానికి ఇలా చేశారని తెలుగుదేశం పార్టీ నేతలు ఆరోపించారు.

నారా లోకేష్ పాదయాత్రకు పాదయాత్రకు గాండ్ల కులస్తుల సంఘీభావం

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సాధికార కమిటీ సభ్యులు కన్నావరం హరిబాబు ఆధ్వర్యంలో పలువురు గాండ్ల సామాజికవర్గ ప్రతినిధులు జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు ని శ్రీ కాళహస్తి నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న పాదయాత్ర లో కలిసి,వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. గాండ్ల తెలికుల,దేవ తిలకుల కార్పొరేషన్ కు సంవత్సరానికి 100 కోట్ల నిధులు కేటాయించుట.ముఖ్య పట్టణాల్లో సామాజిక భవనాల నిర్మాణానికి కనీసం 1000 చదరపు గజాల ప్రభుత్వ స్థలాన్ని మంజూరు చేయుట.దేవాలయాల పాలక మండళ్ల లో నామినేటెడ్ పోస్టులు కేటాయించుట.60 ఏండ్లు నిండిన మా సామాజికవర్గ వృద్ధులకు నెలకు ? 5000/- ల పెన్షన్ ఇప్పించుట.గానుగలు నడుపుతున్న మా కులస్తులకు నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించుట. దేవాలయాలకు దీపారాధనకు నూనె సరఫరాలో గాండ్ల కులస్తులకు ప్రాధాన్యత కల్పించుట.నారా లోకేష్ స్పందిస్తూ తెలుగుదేశం పార్టీ త్వరలో అధికారంలోకి రాబోతున్నదనీ,వచ్చిన వెంటనే గాండ్ల,తెలికుల,దేవ తిలకుల కులస్తుల డిమాండ్లను పరిష్కరిస్తానని,తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమల్లూరు బుజ్జి,సుబ్రహ్మణ్యం ,మహేష్,కార్తిక్,భూపాల్,ప్రకాష్,గాండ్ల సంఘం యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోండి

-తాటిపర్తి రవీంద్రనాథరెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని టీడీపీ నేత, కాపుగున్నేరి సింగిల్ విండో మాజీ అధ్యక్షులు తాటిపర్తి రవీంద్రనాథరెడ్డి విజ్ఞప్తి చేశారు. 'యువగళం'లో భాగంగా 24వ రోజైన బుధవారం ఏర్పేడు మండలం మడిబాకలో నారా లోకేష్ రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాటిపర్తి రవీంద్రనాథరెడ్డి మాట్లాడుతూ... పంట చేతికి వచ్చిన సమయంలో వ్యాపారులు సిండికేట్ గా మారి రైతులకు గిట్టుబాటు ధర లేకుండా చేస్తున్నారన్నారు. ఇలా చేయడం వలన రైతులు పూర్తిగా నష్ట పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటకు ఏడాదంతా ఒకేరకమైన ధర ఉండే విధంగా చర్యలు తీసుకు రావాలని ఆయన కోరారు. అదేవిధంగా రైతులు పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. పంటల వారీగా ప్రభుత్వమే ధర నిర్ణయించాలని కూడా ఆయన కోరారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ... తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు... ప్రభుత్వమే కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇలా చేస్తే అందరూ రుణపడి ఉంటామని నారా లోకేష్ కు రైతులు చెప్పారు.

ఉద్యోగుల ముఖ ఆధారిత నమోదు, హాజరు వంద శాతం వుండాలి

ముఖ ఆధారిత యాప్ లో సంబంధిత శాఖల సిబ్బంది నమోదు హాజరు డిడిఓలు పర్యవేక్షించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - తిరుపతి: ముఖ ఆధారిత హాజరు అమలులో భాగంగా ఎఫ్. ఆర్. ఎస్. యాప్ లో నమోదు కాకుండా ఇంకనూ మిగిలి ఉన్న ఉద్యోగులు అందరూ సత్వరమే ఎఫ్ఆర్ఎస్ యాప్ లో నమోదు చేసుకోవాలని దాని కొరకు సంబంధిత డి డి ఓ లు తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కే వెంకట రమణా రెడ్డి ఆదేశించారు. బుధవారం ఉదయం తాడేపల్లి నుండి కార్యదర్శి ముత్యాల రాజు వారు సి ఎఫ్ ఎం ఎస్ అధికారి సునీల్ రెడ్డి తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో ముఖ ఆధారిత హాజరుపై వర్చువల్ విధానంలో సమీక్షించగా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ కే వెంకట రమణ రెడ్డి, జే సి డి కే బాలాజీ, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస రావు సంబంధిత జిల్లా అధికారులతో హాజరయ్యారు. విసి అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ చాలా శాఖలు యాప్ లో ఇప్పటికే నమోదు పూర్తి చేసారని, ఎక్కువ సిబ్బంది ఉన్న శాఖలు జిల్లా పంచాయితీ అధికారి, పంచాయితీ రాజ్ ఇంజినీరింగ్, మునిసిపల్ శాఖ, అటవీ శాఖ, వెటర్నరీ యూనివర్సిటీ రెవెన్యూ తదితర శాఖలు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టి పూర్తి చేయాలని సూచించారు. ముఖ ఆధారిత హాజరు యాప్ నందు నమోదు మరియు హాజరు 80 శాతం శాఖలలో పూర్తి అయిందని, దానిని వంద శాతం తప్పక అమలు చేయాలి అని డిడిఓ లు దీనిని పర్యవేక్షించాలని అన్నారు. సిబ్బంది అందరూ ఉదయం సాయంత్రం ముఖ ఆధారిత హాజరు నమోదు చేయాలని తెలిపారు. క్యాంపు లో వెళ్ళిన అధికారులు, ఆన్ డ్యూటీ లో ఇతర ప్రాంతంలో ఉన్న అధికారులు యాప్ లో ఉన్న నియమాల మేరకు తప్పక హాజరు వేయాలని సూచించారు. ఏదైనా సాంకేతిక సమస్యలు, సందేహాలు ఉంటే ఎన్.ఐ.సి. వారిని సంప్రదించాలని అన్నారు. ఈ సమీక్షలో జిల్లా అధికారులు డి ఆర్ డి ఎ పిడి జ్యోతి డి ఎల్ డి ఓ సుశీల దేవి, డి పి ఓ రాజశేఖర్ రెడ్డి, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ అధికారి శంకర్ నారాయణ, పథక సంచాలకులు డ్వామా శ్రీనివాస ప్రసాద్, ఎస్ ఈ ఆర్ డబ్లు ఎస్ విజయ్ కుమార్, జిల్లా సహకార అధికారి ఉమాదేవి, జిల్లా మేనేజర్ సివిల్ సప్లైస్ సుమతి తదితరులు పాల్గొన్నారు.

పన్ను బకాయిలు సకాలంలో వసూలు చేయండి:కమిషనర్

విశాలాంధ్ర - తిరుపతి: నగరపాలక సంస్థ పరిధిలో వసూలు చేయవలసిన ఇంటి పన్నులు, నీటి చార్జీలు, భూగర్భ మురుగునీటి చార్జీలు, అన్ని రకాల పన్నులను సకాలంలో వసూలు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి రెవెన్యూ అధికారులను, రెవెన్యూ ఇన్స్పెక్టర్లను ఆదేశించారు. పన్నుల వసూళ్ల పై బుదవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో రెవిన్యూ అధికారులతో, సిబ్బందితో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో పన్నుల బకాయిలు ఎక్కువగా ఉంటున్నాయని ఆ బకాయిలు సకాలంలో వసూలు చేయాలన్నారు. అలాగే నీటి పన్ను బకాయిలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామన్నారు. రెవిన్యూ సిబ్బందితో పాటు ఇంజనీరింగ్ అధికారులు, అమెనిటీ సెక్రెటరీ లు సమన్వయ పరుచుకుని బకాయిలు వసూలు చేయాలని ఇంజనీరింగ్, రెవిన్యూ అధికారులను ఆదేశించారు. అధిక మొత్తంలో నీటి చార్జీలు బకాయిలు ఉన్నవారి కనెక్షన్లు తొలగించాల్సిందిగా సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్ ను ఆదేశించారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి సచివాలయాల పరిధిలో అడ్మిన్ సెక్రటరీ, అమెనిటీ సెక్రెటరీ, వెల్ఫేర్ సెక్రెటరీ, మహిళా సంరక్షణ కార్యదర్శులు వాలంటీర్లతో కలిసి పన్నులు వసూలు కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. పన్నుల వసూళ్ళలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని ప్రజలకు కావాల్సిన మౌళిక సదుపాయాలు కూడా ఎప్పటికప్పుడు మెరుగైన రీతిలో అందించడం జరుగుతున్నదని ప్రజలు కూడా సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు..ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, రెవిన్యూ అధికారులు లోకేష్ వర్మ, సేతుమాధవ్, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు రాజశేఖర్, ప్రకాష్, సూరిబాబు, మధుసూదన్ రెడ్డి, నవీన్ కుమార్, శంకరయ్య, జ్యోతి రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, రెవిన్యూ సూపరింటెండెంట్ నాగేంద్ర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కలానికి పదునెక్కువ ... వార్తకు వేగం ఎక్కువ : ఆర్ కె రోజా

విశాలాంధ్ర-తిరుపతి: కలానికి పదునెక్కువని ... వార్తకి వేగం ఎక్కువ అని, సమాజానికి ఉపయోగపడే ఎంతో విలువైన సమాచారాన్ని అందించడంలో పాత్రికేయులు ఎల్లప్పుడూ ముందుంటారని పర్యాటక, క్రీడా శాఖ మంత్రి ఆర్ కె రోజా అన్నారు.ఎస్వీ యూనివర్సిటీ సేనెట్ హాల్లో 29వ తిరుపతి ప్రెస్ క్లబ్ 29వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సీనియర్ జర్నలిస్టులకు సన్మాన కార్యక్రమం సభను ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, బాలచంద్రల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడల, పర్యాటక, యువజన, వ్యవహారాల శాఖ మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ పత్రికలలో ప్రచురించే వార్తలలో నిజాయితీ, నిబద్ధత, విలువలతో కూడిన అంశాలపై నిజాయితీగా, నిర్భయంగా ప్రచురించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. పత్రికా విలేకరులు అనుకుంటే ఒక వ్యక్తిని హీరోని చేస్తారని నువ్వెంత అంటే అదే వ్యక్తిని జీరో కూడా చేస్తారని కత్తి కన్నా ... కలానికి పదునెక్కువని ... వేగం ఎక్కువ అని కొనియాడారు. రాష్ట్రంలో రెండు రకాల విలేకరులతో జర్నలిజం నడుస్తుందని, ప్రజల పక్షంగా వార్తలు రాసే వారికి ఎప్పుడు సమాజంలో గౌరవం ఉంటుందన్నారు. అదే యాజమాన్యం యొక్క విధి, విధానాలను, కట్టుబాట్లను పాటిస్తూ వార్తలు రాస్తే నిజాయితీ దెబ్బతిని సదరు పత్రిక విలేఖరికి సమాజంలో గౌరవం దక్కదు అన్నారు. పాతతరం, సీనియర్ జర్నలిస్టుల యొక్క విలువలు, నైతికత, నిబద్ధత, నిజాయితీని ఒడిసి పట్టుకొని కొత్తగా చేరిన జర్నలిస్టులు ఆ పంతాను అనుసరించి నూతన ఆవిష్కరణ సమాజానికి నిజాయితీగా వార్తలు అందించే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.విలువలతో కూడిన జర్నలిజాన్ని ప్రోత్సహించండి : తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డిపాత తరంలోని సీనియర్ జర్నలిస్టులు విలువలతో కూడిన అభ్యుదయ భావజాలాలతో పత్రిక రంగంలో వ్యాసాలను రాసేవారని, ప్రస్తుతం జర్నలిజంలో విలువలతో కూడిన వ్యాసాలు రావలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో అభ్యుదయ భావాలు కలిగిన నాయకుల యొక్క సమాచారాన్ని సేకరించి వార్తలుగా ప్రచురించే వారిని వాటికి ఎంతో విలువ ఉండేదని అన్నారు. ప్రస్తుతం రేటింగ్ కోసమో, మరె ఇతరా విషయమొ తెలియదు కానీ జర్నలిజంలో విలువలు తగ్గిపోయాయని సరైన ఖచ్చితమైన సమాచారాన్ని అందించడంలో కొంత గ్యాప్ ఏర్పడిందన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని వెల్లడించారు. కోవిడ్ సమయంలో తిరుపతి ప్రాంతంలో ప్రజల యొక్క అవస్థలను వెలికి తీయడంలో మీడియా మిత్రుల పాత్ర అభేద్యమైనది అన్నారు. కోవిడ్ సమయంలో కొంతమంది మీడియా మిత్రులను కోల్పోవడం బాధాకరమని వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం నుంచి అందించాల్సిన సహాయ సహకారాలకు కృషి చేస్తామన్నారు.శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కే. రాజారెడ్డి మాట్లాడుతూ ఎస్వీయూ సెనేట్ హాల్లో 29వ ప్రెస్ క్లబ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించుకోవడం ఎంతో ఆనందదాయకం అన్నారు. మీడియా మిత్రులు సమాజానికి నిజాయితీగా, నిబద్ధతగా చేయూతనిస్తూ ముందుకు నడిపించడంలో కీలక పాత్ర వహిస్తారన్నారు.అది మా బాధ్యత ..ప్రెస్ క్లబ్ సెక్రటరీ బాలచంద్ర మాట్లాడుతూ సీనియర్ జర్నలిస్టులను సత్కరించుకోవడం మా బాధ్యతగా భావించాము అన్నారు. మా కమిటీ ఆధ్వర్యంలో తొలిసారి ప్రెస్ క్లబ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇకపై ప్రతి ఏటా ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కొనసాగించేలా తీర్మానం చేస్తామన్నారు. ఎంతోమంది జర్నలిస్టు ఉద్దండెలను ఏకతాటిపైకి తీసుకువచ్చే గొప్ప కార్యక్రమంగా నిలిచిందన్నారు. మా అహ్వానాన్ని మన్నించి విచ్చేసిన సీనియర్ జర్నలిస్టులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రమేష్ కుమార్, విక్రమ్, జాయింట్ సెక్రటరీ దినేష్, ఈసీ మెంబర్లు మహేష్, శివయ్య, వసుంధర, వరప్రసాద రావు, సంజీవ సునీల్ ,లావణ్య కుమార్, పరంధామ రెడ్డి, శ్రీనివాస్, బాలు, ఏ. సుదర్శన్ రెడ్డి, గౌస్ బాషా, సుధీర్, పత్రికా విలేకరులు పాల్గొన్నారు.

మాయా లేదు మర్మం లేదు అంతా ఇంద్రజాలమే

మూఢనమ్మకాలు నుండి మ్యాజిక్ ద్వారా ప్రజల్ని చైతన్య పరుస్తున్న ఎమ్మెస్ రెడ్డి

విశాలాంధ్ర - తిరుపతి: పిసి సర్కార్ సీనియర్ జన్మదిన సందర్భంగా ఆరోజును మెజీషియన్లు అందరూ కలిసి ప్రపంచ మ్యాజిక్ దినోత్సవం గా ప్రకటించుకున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ముసురుకున్న మూఢనమ్మకాలను భరతం పట్టే విధంగా మారుమూల గ్రామాల్లో సైతం మెజీషియన్స్ ప్రదర్శనలివ్వడం ఆధునిక విజ్ఞాన ప్రపంచ ప్రారంభానికి శుభసూచకమని ప్రజలు చర్చించుకుం టున్నారు. కేవలం పట్టణాలకు మహానగరాలకు పరిమితమైన ఇంద్రజాల ప్రదర్శనలు ప్రస్తుతం గ్రామాల్లో సైతం ప్రదర్శనలివ్వడంతో సత్ఫలితాలను ఇస్తుంది.. ఏవో నాలుగు మాటలు ఉచ్చరించి చేతిలో విబూధిని తెప్పించి దైవసంభూతులుగా తమకు తామే ప్రకటించుకొని అమాయక ప్రజలను మోసం చేస్తున్న దొంగస్వాములను ఇంద్రజాలికుల ప్రదర్శనలు విరుగుడు మంత్రాలవుతున్నాయి. దొంగస్వాములు ప్రదర్శించే మంత్రాలన్నీ కేవలం జిమ్మిక్కులు, ట్రిక్కులు మాత్రమేనని విప్పి చెప్పే వీరి మాటలను -తిరుపతి జిల్లా సూళ్లూరుపేటకు చెందిన మెజీషియన్ ఎంఎస్. రెడ్డి తమ మ్యాజిక్ ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు అర్థమయ్యేటట్లు చేస్తున్నారు. మాయలు మంత్రాలు లేవని కేవలం ట్రిక్కులు మాత్రమేనని ఆయన చెబుతున్నారు. అరచేతిలో అద్భుతాలు చూపించి అందర్నీ ఆశ్చర్యపరుస్తున్నారు. మూఢనమ్మకాలను పారద్రోలి ఉత్తమ మెజీషియన్గా పేరు సంపాదించుకున్నారు ఇంద్రజాల మాయలోడని పిలువబడే సూళ్లూరుపేటకు చెందిన మండెం సుబ్రమణ్యంరెడ్డి ఇంద్రజాల తపనతోనే జీవిస్తున్నాడు. గాలినుంచి విబూధి సృష్టించడం,కొబ్బరికాయ నుంచి నీరుకు బదులు నెయ్యి తెప్పించడం, మూడు అడుగుల బారు కత్తిని కడుపులో గుచ్చుకోవడం, కాళీ చేతి గుడ్డల నుండి పావురాని సృష్టించడం , తల మీద మంట పెట్టి టీ కాయడం ,ఖాళీ పేపర్నుంచి కూల్డ్రింగ్ బాటిల్ 'బయటకు తీయడం చిత్రవిచిత్రాలతోపాటు ప్రజల్లో నెలకొని ఉన్న ఇటువంటి మూఢ నమ్మకాలను తన మ్యాజిక్ ద్వారా చైతన్యవంతులు చేస్తున్నావు. సూళ్లూరుపేటలోనే కాకుండా రాష్ట్రంలో 500కు పైగా ప్రదర్శనలు ఇచ్చి అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి, కొణిజేటి రోశయ్య , నారాచంద్రబాబు నాయుడు, ప్రముఖులు డాక్టర్ సి. నారాయణరెడ్డి, డాక్టర్ సమరం, వడ్డే. శోభనాదీశ్వరరావు, సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవి, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత అక్కినేని నాగేశ్వరరావు , రాజేంద్రప్రసాద్, ప్రముఖ సంగీత విద్వాంసులు మంగళం పల్లి బాలమురళీకృష్ణలతోపాటు పలు ఇతర దేశస్తుల ప్రశంసలు అందుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఉగాది పురస్కారమును రెండుసార్లు అందుకున్న ఏకైక మెజీషియన్ ఎమ్మెస్ రెడ్డి, ఇటు ఆంధ్ర ప్రదేశ్ లోనే కాకుండా అటు తమిళనాడు, తెలంగాణ రాష్ట్రంలో కూడా అనేక సన్మాన సత్కారాలు పొంది ఉన్నారు.. తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తిలో జన్మించి, 20 సంవత్సరాలుగా సూళ్లూరుపేట లో నివాసం ఉంటున్నాడు. ఎం.ఎస్. రెడ్డి .15 సంవత్సరాలుగా మ్యాజిక్ ప్రదర్శనలు ఇస్తున్నాడు. బి.వి. పట్టాభిరామన్ ఏకలవ్య శిష్యుడిగా మ్యాజిక్ ట్రిక్కులు నేర్చుకున్నప్పటికీ ఇందులో మరింత పరిణితి చెందడానికి ఇక్కడ షార్ కాలనీలో నివాసముంటున్న మరో మెజీషియన్ సిఎం వేలు, రమణయ్య, వద్ద కొంతకాలం శిష్యరికం చేసి ఎన్నో మెళుకువలు నేర్చుకున్నాడు.

స్నేహితుని తండ్రి పరామర్శించిన జెడి

విశాలాంధ్ర-తిరుపతి: స్టేట్ బ్యాంక్ కాలనీలో జె.డి.లక్ష్మీనారాయణ తన తండ్రి స్నేహితుడైన తిరుపతి రచయిత వాకాప్రసాద్ తండ్రి అనారోగ్యంతో వున్నారని తెలిసి బుధవారం మధ్యాహ్నం వారి ఇంటికి వచ్చి పరామర్శించారు. యాభై ఏళ్ల క్రితం శ్రీశైలం డ్యామ్ క్వార్టర్స్ లో కలసి వున్న జ్ఞాపకా లను కాసేపు ముచ్చటించు కున్నారు.

అశ్వ, సింహ వాహనాలపై ఆదిదంపతుల వైభవం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా 10 రోజైన బుధవారం రాత్రి గంగాభవానీ సమేత శ్రీకాళహస్తీశ్వరుడు అశ్వ వాహనం పైనా... జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారు సింహ వాహనం పైనా అధిష్టించి పురవిహారం చేశారు. కైలాసగిరి ప్రదక్షిణకు వెళ్లి సకల దేవతా గణాలకు వీడ్కోలు పలికిన ఆదిదంపతులు రాత్రి 8గంటల ప్రాంతంలో ఆలయానికి చేరుకున్నారు. కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న తరువాత అశ్వ, సింహ వాహనాలపై పురవిహారం చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పురవీధుల్లో ఊరేగుతున్న ఆదిదంపతులను దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

హస్త కళాకారుల అభివృద్ధి కొరకై

శిక్షణ, డిజైన్, మార్కెటింగ్

వర్కుషాప్ లో డాక్టర్ గుమ్మిడిపూడి దశరాథాచారి

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : కొయ్య బొమ్మల, కాలంకారి ఇతర హస్త కళాకరుల అభివృద్ధి కొరకు కళాకారులకు శిక్షణ, డిజైన్, మార్కెటింగ్ పై అవగాహన ఉండాలని మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గుమ్మిడిపూడి దశరాథాచారి పేర్కొన్నారు. బుధవారం చిత్తూరు హ్యాండీక్రాఫ్ట్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్, శ్రీకాళహస్తి వారి ఆధ్వర్యములో కొత్తపేటలోని కళా సృష్టి కామన్ ఫెసిలిటీ సర్వీస్ సెంటర్, శ్రీకాళహస్తి నందు చిత్తూరు హ్యాండీక్రాఫ్ట్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గుమ్మిడిపూడి దశరథాచారి అధ్యక్షతన రెండు రోజుల అంబేద్కర్ హస్తశిల్ప వికాస్ యోజన వర్క్ షాప్, హస్తకళాకారుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యా రమ (వైస్ ప్రిన్సిపాల్ ఎక్స్టెన్షన్ ట్రైనింగ్ సెంటర్, కాసాగార్డెన్ , శ్రీకాళహస్తి), నేతా, హెచ్‌పిఓ(హస్తకళలు), ధర్మరాజులు (హ్యాండీక్రాఫ్ట్స్ సర్వీస్ సెంటర్, తిరుపతి), మిన్నల్ కరుణాకర్ (రిటైర్డ్ ఎంఎల్ఓ, తొట్టంబేడు, శ్రీకాళహస్తి), సత్యనారాయణ (లేపాక్షి మేనేజర్, తిరుపతి), తిమోతి (మేనేజర్ యూనియన్ బ్యాంకు శ్రీకాళహస్తి), యస్.వి.యూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీకాళహస్తి లెక్చరర్స్ డాక్టర్ యస్. హరిబాబు, డాక్టర్ యు.రఘు, డాక్టర్ సతీష్, డాక్టర్ చంద్ర మౌళి, జి.మునిలక్ష్మి (శుభోదయం కాలంకరి మాక్స్ సొసైటీ, శ్రీకాళహస్తి) ముఖ్య అతిథులుగా పాల్గొని వారి యొక్క సూచనలను సలహాలను కొయ్య బొమ్మల మరియు కాలంకారి ఇతర హస్త కళాకరుల అభివృద్ధి కొరకై, శిక్షణ, డిజైన్, మార్కెటింగ్, ముద్రా, పిఎంఇజిపి రుణాల కొరకై తగిన సూచనలను అందించారు. మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గుమ్మిడిపూడి దశరాథాచారి మాట్లాడుతూ హస్తకళల అభివృధి కోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చెప్పట్టవలసిన కార్యక్రమాల గూర్చి వివరించారు. అదే విధముగా కొయ్యబొమ్మల, ఇతర హస్త కళాకారులకు కేంద్ర ప్రభుత్వం చేస్తునట్టువంటి సహాయ సహకారాలను అందిపుచ్చుకొని అభివృధి దిశలో ప్రయాణించవలసినదిగా సూచించారు. కార్యక్రమములో సుమారు 100మంది హస్త కళాకారులు పాల్గొన్నారు.

బారామతి కృషి విజ్ఞాన కేంద్రంలో టీటీడీ అధికారులు బృందం

విశాలాంధ్ర - తిరుపతి: దేశీయ గోజాతుల అభివృద్ధి, డెయిరీల నిర్వహణపై మహారాష్ట్రలో క్షేత్రస్థాయి అధ్యయనం చేస్తున్న టీటీడీ అధికారుల బృందం బుధవారం బారామతిలోని ప్రఖ్యాత కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించింది.టీటీడీ జేఈవో సదా భార్గవి నేతృత్వంలో చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, గోశాల డైరెక్టర్ డాక్టర్ హరనాథరెడ్డి, పశువైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ వెంకట నాయుడు బృందం మహారాష్ట్రలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బారామతిలోని ప్రఖ్యాత కృషి విజ్ఞాన కేంద్రం లో క్షేత్ర స్థాయి అధ్యయనం చేసింది. జన్యు ప్రక్రియ ద్వారా దేశీయ గోజాతులను పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్న విధానాన్ని క్షుణ్ణంగా ఈ బృందం పరిశీలించింది. దేశీయ గో జాతుల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, యాజమాన్య పద్ధతులు, స్వచ్ఛమైన పాల దిగుబడికి అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేసింది. ఇందుకు అవసరమయ్యే మౌళిక వసతులను టీటీడీ అధికారులు బృందం పరిశీలించింది. టీటీడీ గోశాలలో రోజుకు 4 వేల లీటర్ల స్వచ్ఛమైన దేశ వాళీ ఆవు పాలను దిగుబడి చేసుకోవడానికి అనుసరించవలసిన విధానాలపై అక్కడి అధికారులు, శాస్త్రవేత్తలతో చర్చించారు. బారామతి కృషి విజ్ఞాన కేంద్రంలో పశువైద్యం, హార్టీకల్చర్, అగ్రికల్చర్, ఫ్లోరీకల్చర్ పై రైతులకు నూతన మెళకువలు, సాంకేతికను జోడించి సంప్రదాయ వ్యవసాయం చేయడంపై నిపుణులు శిక్షణ ఇస్తూఉంటారు. టీటీడీ గోఆధారిత ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహిస్తూ, వారికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో అధికారుల బృందం అక్కడి శిక్షణా తరగతుల తీరును పరిశీలించింది. రైతులను సంప్రదాయ వ్యవసాయం వైపు ప్రోత్సహించడానికి అక్కడి అధికారులు అనుసరిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. అనేక అంశాలపై అధికారులతో చర్చించారు.

విశాలాంధ్ర చిత్తూరు జిల్లా

యువగళం పాదయాత్ర రూట్ మ్యాప్ ను పరిశీలించిన చల్లా రామచంద్రారెడ్డి

విశాలాంధ్ర -పులిచెర్ల-కల్లూరు: పులిచెర్ల మండలంలో మార్చి మొదటి వారంలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువ గళం రూట్ మ్యాప్ సభా స్థలిని బుధవారం పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి పరిశీలించారు. మండలంలో కొమ్మి రెడ్డి గారి పల్లి నుంచి పీలేరు మార్గంలోని ఎం జె ఆర్ కళాశాల వరకు పాదయాత్రను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా టిడిపి ఇన్చార్జి మాట్లాడుతూ యువ గళం పాదయాత్రను సమన్వయంతో విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు రామనాథం నాయుడు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి ముల్లంగి వెంకటరమణ, రాజంపేట పార్లమెంటరీ కార్యదర్శులు సుబ్బారెడ్డి లెక్కల ధనంజయ నాయుడు, నాయకులు కుమార్ రెడ్డి, బండ్ల రమేష్ ,నజీర్, గోపి నాయుడు ,అన్నా స్వామి, చంగల్రాయ నాయుడు, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిద్దింటి వెంకటస్వామి తృతీయ వర్ధంతి

విశాలాంధ్ర - పుంగనూరు: అంబేద్కర్ సర్కిల్ యందు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు దళిత బాంధవుడు దళితుల పక్షాన ఎన్నో పోరాటాలు చేసిన మిద్దింటి వెంకట్ స్వామి తృతీయ వర్ధంతి వేడుకలను ఎమ్మార్పీఎస్ నాయకులు దళిత సంఘాల ఆధ్వర్యంలో బుధవారం రోజున అంబేద్కర్ సర్కిల్ నందు ఘనంగా నిర్వహించడం జరిగింది డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించడం జరిగింది ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు నరసింహులు మాల మహానాడు నాయకులు అశోక్ మాట్లాడుతూ మిద్దింటి వెంకటస్వామి గారు లేని లోటును ఎవరు భర్తీ చేయలేరన్నారు దళితుల సంక్షేమం కోసం అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకు రావడానికి అయన ఎంతో కృషి చేశారు అని తెలియజేశారు చిత్తూరు జిల్లా వాసిగా ఉద్యమాల పులి బిడ్డా గా బతికి నేడు మా ముందు లే నందుకు మేము ఎంతో బాధ పడుతున్నాము అన్నారు నేటి దళిత సమాజం ఆయన అడుగుజాడల్లో నడుస్తూ దళితుల రాజ్యాధికారం కోసం ప్రతి ఒక్కరు ముందుకు వెళ్లాలని కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలోబోయకోండ శంకర దళిత సమితి అధ్యక్షుడు శంకరప్ప కమిటీ సభ్యులు రాజు మిద్దింటి పృథ్వి కుమార్ అమర్నాథ్ బాజిగం హరిబాబు పగడాల గెంగిరెడ్డి గోవిందు ఆంజప్ప హరిబాబు మాంట్రీంగ్ కమిటీ సభ్యులు క్రిష్ణప్ప గంగాధర రెడ్డెప్ప మరియు మిద్దింటి అభిమానులు భారీగా పాల్గొన్నారు.

జనసంద్రంగా మారిన చిత్తూరు

విశాలాంధ్ర- చిత్తూరు: ఎమ్మెల్సీ నామినేషన్ల సందర్భంగా బుధవారం ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడంతో చిత్తూరు నగరం జనసంద్రంగా మారింది. చిత్తూరు ప్రకాశం నెల్లూరు జిల్లా నుంచి ఈ నామినేషన్ కార్యక్రమానికి భారీ సంఖ్యలో వివిధ పార్టీల కార్యకర్తలు నాయకులు వివిధ సంఘాల నేతలు ఉపాధ్యాయులు తరలి రావడంతో చిత్తు నగరంలో బుధవారం సుందర వాతావరణం నెలకొంది. వివిధ పార్టీల అభ్యర్థులు తమ నామినేషన్ దాఖలు సందర్భంగా నగరంలో భారీ ర్యాలీ చేపట్టారు దీంతో నగరంలోని వీధులన్నీ హోరెత్తాయి. బుధవారం నెల్లూరు ప్రకాశం చిత్తూర్ పట్టభద్రులు ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు ప్రధాన పార్టీలైన వైసిపి టిడిపి పిడిఎఫ్ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా చిత్తూరు కలెక్టర్ కార్యాలయం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. చిత్తూరు ప్రకాశం నెల్లూరు పట్టపదులు ఉపాధ్యాయుల నియోజకవర్గాలకు వైసీపీ అభ్యర్థులైన శ్యాం ప్రసాద్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డిలో నగరంలో భారీ ర్యాలీ చేపట్టారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, రాష్ట్ర మంత్రులు కాకాని గోవర్ధన్ రెడ్డి, ఆదిమూలపు సురేష్, ఆర్కే రోజా తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే శ్రీనివాసులు, చింతల రామచంద్రారెడ్డి బాలేని శ్రీనివాస్ రెడ్డి లతో పాటు భారీ సంఖ్యలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. టిడిపి పట్టపదుల ఎమ్మెల్సీ స్థానానికి కంచర్ల శ్రీకాంత్ పార్టీ నేతలైన బీద రవిచంద్ర, ఎమ్మెల్సీ దొరబాబు, చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు పులివర్తి నాని, మాజీ మేయర్ కటారి హేమలత తదితర నేతలతో ర్యాలీగా వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. పిడిఎఫ్ అభ్యర్థులు బాబు రెడ్డి వెంకటేశ్వర రెడ్డి నగరంలో పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బాలసుబ్రమణ్యం తో పాటు అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.

బీసీలకు న్యాయం చేసిన ఘనత ముఖ్యమంత్రి కే దక్కుతుంది

విశాలాంధ్ర- గంగాధర నెల్లూరు: బీసీలకు న్యాయం చేసిన ఘనత మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి మాత్రమే దక్కుతుందని వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్యామల శివప్రకాష్ రాజు అన్నారు .పాలసముద్రం మండలం ఎంపీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి అన్ని కులాలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ ఈరోజు వడ్డే కులస్తులకు ఎమ్మెల్సీలు ఇవ్వడం ద్వారా జగన్మోహన్ రెడ్డి బడుగు బలహీన వర్గాలకు ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారో తెలుస్తుందని ఆయన అన్నారు అదేవిధంగా ఏ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి పథకం పేదల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న ప్రభుత్వం మన వైసీపీ ప్రభుత్వమని అదేవిధంగా మండలంలోని టిడిపి నాయకులు ఏమీ అభివృద్ధి జరగనట్లు మాట్లాడుతున్నారని ఒక్కసారి కళ్ళు తెరిచి చూస్తే వాళ్లకే అర్థం అవుతుందని దాదాపు 45 కోట్లతో డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతో రోడ్లు ప్రాజెక్టులు అయితే నేమి దేవాలయాల అభివృద్ధి అయితేనేమి ఇలా ఎన్నో పనులు జరుగుతున్న ఇవన్నీ వారి కళ్ళకు కనపడటం లేదని అదేవిధంగా డిప్యూటీ సీఎం పై అసత్య ఆరోపణలు చేయడం తగదు అని ఆయనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని సంస్కారం మరిచి అసభ్య పదజాలంతో మాట్లాడుతున్నారని మీలాగా మేము మాట్లాడడం ఎంతోసేపు పట్టదని మాకు సంస్కారం అడ్డు వస్తుందని ఆయన అన్నారు మండల కన్వీనర్ తులసి యాదవ్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి రాబోయే ఎన్నికల్లో ఆయనకు విజయాన్ని అందిస్తుందని ఆయన అన్నారు జడ్పిటిసి ఆన్బలగన్ మాట్లాడుతూ మన ప్రభుత్వం చేపడుతున్న పథకాలను పక్క రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని ఆయన అన్నారు వడ్డెర సంఘం నాయకులు వేణు మాట్లాడుతూ మాపై జగనన్న చూపుతున్న ప్రేమకు జీవితాంతం పార్టీ జెండా మోయడానికి మేము సిద్ధమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యవసర సరుకుల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే సహించం

విశాలాంధ్ర-గంగాధర్ నెల్లూరు: నిత్యవసర సరుకులు పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని పాలసముద్రం మండల తాసిల్దార్ బాబు అన్నారు బుధవారం నాడు జరిగిన డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదలకు అందిస్తున్న నిత్యవసర సరుకులు సకాలంలో వారికి చేరాలని ఏ ఒక్కరు కూడా మాకు సరుకులు అందలేదన్న ఫిర్యాదులు రాకూడదని అలా వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు అదేవి ధంగా ఎప్పటికప్పుడు ఎంత స్టాక్ ఉన్నది అన్న దానిపై పై అధికారులకు తెలియజేయాలన్నారు అదేవిధంగా తూకాలు కచ్చితంగా ఉండాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలం

విశాలాంధ్ర - వి. కోట : వి.కోట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ ఎక్సైజ్ కేసులలో పట్టుబడిన ఒక కారు, మూడు ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నట్లు సి. ఐ. ప్రసాద్ బాబు తెలిపారు. 24 వ తేది శుక్రవారం ఉదయం పదిన్నర గంటలకు వి.కోట అర్బన్ పోలీస్ స్టేషన్ వద్ద నిర్వహించనున్న వేలం లో పాల్గొనే వారు వేలంలో వాహనాలు పొందిన వారు వేలం పాట కు పద్దెనిమిది శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసేలా నిధులు ఇవ్వండి

- సంగమేశ్వర నదిపై బ్రిడ్జి మరియు బ్యారేజ్ నిర్మించాలి - ఎర్రచందనం స్మగ్లింగ్ పై సీబీఐ విచారణకు ఆదేశించాలి
- ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలిసి వినతి చేసిన రామచంద్ర యాదవ్

విశాలాంధ్ర-పుంగనూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొన్ని లక్షల మంది రైతుల కల అయిన పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసేలా నిధులు కేటాయించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ను కోరుతూ అలాగే రోడ్లు రహదారుల కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షేకావత్ కేంద్ర అటవీ శాఖ మాత్యులు భూపేంద్ర యాదవ్ ను కలిసి రాష్ట్ర సమస్యల పట్ల రాష్ట్ర యువ నాయకులు బోడే రామచంద్ర యాదవ్ వినతి చేశారు. బుధవారం న్యూఢిల్లీలో రాష్ట్రంలోని వివిధ సమస్యలపై కేంద్ర మంత్రులకు వినతి పత్రాలు అందజేసి సమస్యలు పరిష్కరించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ దాదాపు 30 ఏళ్ల క్రితం పోలవరం ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగా కేవలం రూ.2వేల కోట్లు నుంచి రూ.3 వేల కోట్లతో ప్రాజెక్టు పూర్తి కావాల్సింది. కేవలం రాష్ట్ర ప్రభుత్వాలు, అధికారుల నిర్లక్ష్యంతోనే పూర్తి కాలేదని,2014లో కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించి నిధులు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వ అలసత్వంతో పూర్తి కాలేదని చెప్పారు ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం ఏమాత్రం పోలవరం ప్రాజెక్టును పట్టించుకోలేదని తెలియజేశారు కేంద్ర ఆర్థిక మంత్రి చొరవ తీసుకొని పోలవరం పూర్తి కావడానికి నిధులు కేటాయించి కేంద్రం చొరవ చూపి పూర్తి అయ్యే విధంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రాయలసీమలోని నంద్యాల జిల్లా సంగమేశ్వర నదిపై కేంద్ర ప్రభుత్వం నిర్మించనున్న ఐకానిక్ బ్రిడ్జి వల్ల ప్రజలు, రైతులు తీవ్రంగా నష్టపోతారని, ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కేంద్ర రహదారుల శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ కు వినతి చేశామన్నారు. ఐకానిక్ బ్రిడ్జ్ వల్ల కేవలం రవాణా సమస్య తీరుతుంది తప్ప రైతులకు ప్రయోజనం ఉండదన్నారు. ఐకానిక్ బ్రిడ్జి స్థానంలో రవాణా కోసం బ్రిడ్జి, రైతుల కోసం బ్యారేజ్ నిర్మిస్తే రాయలసీమలోని వేలాది మంది రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు వస్తుందన్నారు. తద్వారా విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. బ్రిడ్జ్ మరియు బ్యారేజ్ నిర్మించాలని రాయలసీమలో వేలాది మంది రైతులు నది జలాల కోసం పోరాటాలు చేస్తున్నారని వివరించారు. ఈ ప్రతిపాదన పరిశీలించి ఏమాత్రం అవకాశం ఉన్న బ్రిడ్జి తో పాటు బ్యారేజ్ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రధానంగా శేషాచలం అడవుల్లో జరిగే ఎర్రచందనం స్మగ్లింగ్ నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ ను కోరడం జరిగిందని చెప్పారు. ప్రతిరోజు కోట్ల రూపాయల విలువచేసే ఎర్రచందనం స్మగ్లింగ్ అవుతోందని, రాష్ట్ర ప్రభుత్వం దీనిపై శ్రద్ధ చూపడం లేదని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించి స్మగ్లింగ్ పై సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. రాష్ట్ర సమస్యలపై వినతి చేసిన ముగ్గురు కేంద్ర మంత్రులు సమస్యల గురించి పూర్తిగా వివరించేందుకు అవకాశం ఇచ్చి, సానుకూలంగా స్పందించినందుకు రాష్ట్ర యువ నాయకుడు రామచంద్ర యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

వెదురుకుప్పంలో నాడు-నేడుకు గ్రహణం

- పాఠశాలల్లో ఆగిన పనులు - సుమారు 5500 బస్తాల సిమెంట్ గడ్డలు కట్టిన వైనం - నిద్రావస్థలో అధికార యంత్రాంగం

విశాలాంధ్ర-వెదురుకుప్పం: కొండనాలుకకు మందేస్తే...ఉన్న నాలుక ఊడిందంట అన్న చందంగా ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు సాగుతున్నాయి.రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటు కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా నాడు నేడు పథకం ద్వారా అభివృద్ధి పనులు చేపట్టింది.ఈ క్రమంలో వెదురుకుప్పం మండలం లో మొదటివిడత నాడు నేడు పనులలో భాగంగా 27 పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేశారు. కాగా రెండవ దశలో 32 పాఠశాలల్లో పనులు సుమారు 8 కోట్లరూపాయిల తో డిసెంబర్ 2021 న ప్రారంభించారు.ఇందుకోసం ప్రభుత్వం తరపు సిమెంట్ అందించింది.కొన్ని చోట్ల పనులు ఆగిపోయిన నేపథ్యం లో సిమెంట్ బస్తాలు పాఠశాల భవనాల్లో గడ్డలు కట్టిపోయింది.దీంతో ప్రభుత్వానికి లక్షలల్లో నష్టం వాటిల్లిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలో సుమారు 5500 బస్తాలు వినియోగానికి పనికిరాకుండా పోయిందని చెబుతున్నారు. ఇదంతా ఎవరి నిర్లక్ష్యం అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం ఆశించిన లక్ష్యానికి అధికార యంత్రాంగం తూట్లు పొడు స్తోందా లేక ప్రభుత్వ వైఫల్యాలు ఉన్నాయా అని తెలియాల్సి వుంది.ఇదే విషయమై నాడు నేడు అసిస్టెంట్ ఇంజనీరు మంజుల వివరణ కోరగా ప్రభుత్వం నుంచి నిధుల మంజూరు ఆలస్యం కావడంతో పనులకు బ్రేక్ పడింది.సిమెంట్ బస్తాలు కొద్దిమేర గడ్డలు కట్టిన మాట వాస్తవమే అన్నారు.పర్యవేక్షణ అధికారి సమగ్ర శిక్షా ప్రాజెక్టు ఆఫీసర్ వెంకటరమణ రెడ్డి వివరణ కోరడానికి ప్రయత్నించగా అందుబాటులో కి రాలేదు.

ప్రకాశం నెల్లూరు చిత్తూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులు గా వివిధ పార్టీలకు చెందిన వారు నామినేషన్లు దాఖలు చేశారు.

టీడీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన కంచర్ల శ్రీకాంత్

పిడిఎఫ్ టీచర్ల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పి బాబు రెడ్డి నామినేషన్

పిడిఎఫ్ గ్రాడ్యుయేట్ అభ్యర్థిగా ఎం వెంకటేశ్వర రెడ్డి నామినేషన్

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీఎస్పీ అభ్యర్థి వీరభద్రాచారి

వీధికుక్కల దాడి లో గొర్రెపిల్లలు మృతి

విశాలాంధ్ర - వెదురుకుప్పం: వీధికుక్కల దాడి లో గొర్రెపిల్లలు మృతి చెందిన సంఘటన బ్రహ్మణపల్లి లో బుధవారం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే మండలంలోని బ్రహ్మణపల్లి కి చెందిన లోకేష్ రెడ్డి గొర్రెలు మేపుకుని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో గొర్రె పిల్లలను ఇంటివద్ద దొడ్డిలో పెట్టారు.మధ్యాహ్నం ఎవరు లేని సమయంలో ఊరకుక్కలు దాడి చేసి 12 పిల్లలను గాయ పరచి చంపేసినట్లు స్థానికులు చెప్పారు.జీవనాధారమయిన గొర్రె పిల్లలు పోగొట్టుకున్న నేపథ్యం లో ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేసారు.

టిడ్కో గృహాలకు రుణాల ప్రక్రియ త్వరగా పూర్తి చేయండి

విశాలాంధ్ర -చిత్తూరు : టిడ్కో గృహాలకు సంబంధించి రుణాల మంజూరు ప్రక్రియను బ్యాంకర్లు త్వరగా పూర్తి చేయాలని నగర కమిషనర్ అరుణ కోరారు. బుధవారం మధ్యాహ్నం నగరపాలక సంస్థ పరిధిలో పూనేపల్లి వద్ద నిర్మించిన టిడ్కో గృహ సముదాయాలను, పూర్తి చేసిన పనులను బ్యాంకర్లకు చూపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగర కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలు, మధ్యతరగతి ప్రజలకు సొంత ఇల్లు నిర్మించి ఇవ్వాలని లక్ష్యంతో టిడ్కో గృహాలను నిర్మిస్తుందన్నారు. ఇందులో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు సంబంధించి బ్యాంకర్లు రుణాల మంజూరు ను వేగవంతం చేయాలన్నారు. మౌలిక వసతులు, సివిల్ పనులు దాదాపుగా పూర్తి కావొచ్చాయని ఈ దశలో మిగిలిన రుణాలను మంజూరు చేయాలన్నారు. నిరుపేదల కోసం నిర్మించిన 300 చదరపు అడుగుల గృహాల పనులు పూర్తయ్యాయి, రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇప్పటికే పూర్తి చేసినట్లు వివరించారు. సమావేశంలో మెప్మా పీడీ రాధమ్మ, ఎల్డీఎం శేషగిరిరావు, టిడ్కో ఈఈ వెంకటముని, ఎసీపీ రామకృష్ణుడు, సీఎంఎం గోపి, బ్యాంకర్లు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజనులకు ఘన సన్మానం

విశాలాంధ్ర-పలమనేరు: అఖిలభారత పెన్షనర్ల దినోత్సవం పురస్కరించుకొని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ పలమనేరు పరిరక్షణ సమితి ఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎన్జీవో భవనంలో 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సీనియర్ పెన్షనర్లకు ఘనంగా సన్మానం చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాసిల్దార్ కుప్పస్వామి, సబ్ ట్రెజరీ అధికారి మునికృష్ణయ్య స్టేట్ బ్యాంక్ మేనేజర్ హరి ప్రసాద్ పరిరక్షణ సంఘం నాయకులు నరసింహులు సుబ్రమణ్యం పిళ్ళై, ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు ఆనందబాబు, రాష్ట్ర కార్యదర్శి గురు రాజారావు హాజరైనారు.సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉద్యోగుల పెన్షనర్ల సమస్యలు పరిష్కారానికికృషి చేస్తామన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు ఫిబ్రవరి 28 లోగా తమ లైఫ్ సర్టిఫికెట్లుసమర్పించాలన్నారు. అనంతరం 125 మంది పెన్షనర్లకు పూలమాలలు వేసి సేలవాల కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ముగం, బాలసుబ్రమణ్యం, గుణశేఖర్, దొరస్వామి నాయుడు, జ్ఞానేశ్వర్, నారాయణ, గోవిందయ్య, మోహన్, సుబ్రహ్మణ్యం, సాంబయ్య, కేశవరెడ్డి, నాగభూషణం, మాలతి, నాగభూషణ అమ్మ, చెంచులయ్య, రామానాయుడు పాల్గొన్నారు.

గణనాధుని సేవలో రాష్ట్ర హోం మంత్రి



విశాలాంధ్ర - ఐరాల : స్వయంభు వరసిద్ధి వినాయక స్వామి దర్శనార్థం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర హోం శాఖ మంత్రివర్యులు తానేటి వనిత బుధవారం కాణిపాకం విచ్చేశారు. వీరిని పూతలపట్టు నియోజకవర్గం ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు మరియు ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులచే ఆశీర్వచనం, స్వామివారి చిత్రపటం,తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి శ్రీనివాసమూర్తి, సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సైలు, స్థానిక సర్పంచ్ శాంతి సాగర్ రెడ్డి, స్థానిక ఎంపీటీసీ లీ లజ సుధీర్, పర్యవేక్షకులు కోదండ పాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్లు బాలాజీ నాయుడు, బాబు, స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి సంక్షేమం ముఖ్యమంత్రికి రెండు కళ్ళు

ఎస్సీ ఎస్టీ కమిటీ సభ్యులు రాజు

విశాలాంధ్ర - పుంగనూరు : అభివృద్ధి సంక్షేమం ముఖ్య మంత్రి కి రెండు కళ్ళుగా పాలన కొనసాగిస్తున్నా రని దళిత సంఘం నాయకులు రాజు తెలిపారు. ఈ సందర్భంగా వారు బుధవారం పుంగనూరు పట్టణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచం ద్రారెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు రాజు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎస్సీ ఎస్టీ బిసి ఓసి మైనార్టీ సంఘాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారు. చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం ను అభ్యర్థిగా ఖరారు చేయడం తమకు ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణప్ప, చిన్న రాయుడు ,శంక రప్ప పిఎంపి డాక్టర్ల సంఘం సభ్యులు ఏస్ అమర్నాథ్, ముని రత్నం, లక్ష్మీనారాయణ ,బాబు, హరిప్రసాద్, సురేష్ ,రామచంద్ర దళిత సంఘం సభ్యులు దితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ నామినేషన్ కార్యక్రమంలో ఆసూరి బాలాజి

విశాలాంధ్ర - పుంగనూరు: చిత్తూరు ప్రకాశం నెల్లూరు జిల్లాల తెలుగుదేశం పార్టీ తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కంచర్ల శ్రీకాంత్ బుధవారం రోజున చిత్తూరు కలెక్టరేట్లో నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఆసూరి బాలాజీ పాల్గొని ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అవినీతి అక్రమాలు దౌర్జన్యాలు ప్రభుత్వ అధికారులపై నిరుద్యోగ యువతపై రాష్ట్ర ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులను గ్రహించి ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ను గెలిపించాలని కోరారు. అనేక విద్యాసంస్థలు ఏర్పాటు చేసి పేద బడుగు బలహీన వర్గాలకు ఉన్నత విద్యను అందిస్తున్న కంచర్ల శ్రీకాంత్ను ఈ ఎన్నికల్లో గెలిపించుకుంటే రానున్న రోజుల్లో ఉద్యోగస్తులు నిరుద్యోగ యువత తరపున శాసనమండలిలో పోరాటం చేయడం జరుగుతుందన్నారు.

కోడి పందెం రాయళ్లు అరెస్ట్

విశాలాంధ్ర -పులిచెర్ల-కల్లూరు: పులిచెర్ల మండలం వెంకట దాసరి పల్లి పంచాయతీ జూపల్లె వారి పల్లె వద్ద కోడి పందెం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు కల్లూరు ఎస్సై రవి ప్రకాష్ రెడ్డి తెలిపారు. కోడి పందెం రాయళ్లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 2 కోళ్లను రూ 2540 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల అబ్జర్వర్ల నియామకం

విశాలాంధ్ర -చిత్తూరు: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ముగ్గురు అబ్జర్వర్లను నియామకం చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రకాశం ం చిత్తూరు గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులుగా కె.సునీత ఐఏఎస్ ,ప్రకాశం- నెల్లూరు- చిత్తూరు ఉపాధ్యాయ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులుగా కోన శశిధర్ ఐఏఎస్ వారిని, స్థానిక సంస్థల ఎం ఎల్ సి ఎన్నికల పరిశీలకులుగా బి. శ్రీధర్ ఐఏఎస్ వారిని నియమిస్తూ ఎన్నిక సంఘం ఉత్తర్వులు జారీ చేసింది.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - చిత్తూరు: చిత్తూరు మాజీ ఎంపీ ఎన్పీ చెంగల్రాయ నాయుడు జ్ఞాపకార్థం ఆయన కుటుంబీకులు మాజీ ఎమ్మెల్యే ఎంపీ వెంకటేశ్వర చౌదరి ఆధ్వర్యంలో అరవింద్ కంటి ఆసుపత్రి వైద్యులచే నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కరుణ కుమార్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన బంగారుపాళ్యం చెంగల్రాయ నాయుడు విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన శిబిరానికి బంగారుపాలెం మండలం నుండే కాక పరిసర మండలాల నుండి సైతం పెద్ద సంఖ్యలో రోగులు పాల్గొని చికిత్సను పొందారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ ,మాజీ సర్పంచ్ కమల్నాథరెడ్డి ,సురేంద్ర నాయుడు రవీంద్ర నాయుడు, ధరణి, శ్రీనివాసులు, అరవింద్ కంటి వైద్య ఆసుపత్రి సిబ్బంది డాక్టర్ లహరి ,డాక్టర్ రచన ,డాక్టర్ ఎన్.మిథిలేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు .ఈ శిబిరంలో 197 మంది పాల్గొనగా 25 మంది కి ఆపరేషన్ నిమిత్తం ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎన్నికల విధుల నుంచి ఎమ్మార్వో తొలగింపు

విశాలాంధ్ర -చిత్తూరు: చిత్తూరు ఎమ్మార్వో పార్వతిని ఎమ్మెల్సీ ఎన్నికల విధుల నుంచి తొలగిస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు నగరానికి చెందిన రాంబాబు అనే వ్యక్తి ఓటును ఎమ్మార్వో తొలగించడంతో, దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ఎన్నికల సంఘం ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల విధుల నుంచి చిత్తూరు ఎమ్మార్వో నుతొలగిస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది.

భక్తులకు పానకం పంపిణీ

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి : దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీకాళహస్తీశ్వర ఆలయ మహా శివరాత్రి వార్షిక బ్రహ్మోత్స వాల్లో భాగంగా బుధవారం గిరి ప్రదక్షిణ సందర్భంగా శ్రీ జయ నిధి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణకు విచ్చేసిన భక్తులకు నడిబాయి విజయ గణపతి ఆలయం వద్ద బెల్లము పానకం భక్తులకు పంపిణీ చేశారు. ప్రతి ఏటా నిర్వహించే మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గత 8 సంవత్సరాల నుండి శ్రీ జయ నిది సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీ కాళహస్తీశ్వర స్వామి అమ్మవార్ల సేవల్లో శ్రీ జయనిది సేవా ట్రస్ట్ సభ్యులు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తుల సేవలో తరిస్తున్నారు. మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గత 8 సంవత్సరాలుగా శ్రీ జయనిది సేవా ట్రస్ట్ సభ్యులు నిర్వహిస్తున్న వివిధ సేవా కార్యక్రమాలపై భక్తులు పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేసి శ్రీ జయనిది సేవా ట్రస్ట్ సభ్యుల సేవలను కొనియాడుతూ అభినందనలు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ జయనిది సేవా ట్రస్ట్ సభ్యులు నీలకంఠ గురుకుల్ వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

స్వామి అమ్మవార్లకు సారే-భక్తులకు అన్నదానం

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి : దక్షిణ కైలాసంగా పేరుగాం చిన శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం గిరి ప్రదక్షిణ సందర్భంగా పట్టణానికి చెందిన కాసరం బాలాజీ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో వీరి నివాసం నుండి మేళతాళాలతో స్వామి అమ్మవార్లకు సారే అందజేశి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు సుమారు 4000 మందికి పైగా భక్తులకు అన్నదానం, మజ్జిగ, శీతల పానీయాలు పంపిణీ చేశారు. ప్రతి ఏటా నిర్వహించే మహాశివరాత్రి వార్షికోత్సవం బ్రహ్మోత్సవాల సందర్భంగా గిరి ప్రదక్షిణ సందర్భంగా కాసారం బాలాజీ కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో అనవాయితీగా భక్తులకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉండడం అభినందనీయమని భక్తులు పట్టణ ప్రముఖులు వీరి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాసారం బాలాజీ కుటుంబ సభ్యులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

హైస్కూల్‌కు వాటర్ ట్యాంక్ వితరణ

విశాలాంధ్ర- సత్యవేడు:సత్యవేడు మండలం మదనంబేడు జడ్పీ ఉన్నత పాఠశాలకు గ్రామ మాజీ సర్పంచ్ కీర్తిశేషులు ఎత్తిరాజులు కుమారుడు రజనీకాంత్ సింటెక్స్ మినీ వాటర్ ట్యాంక్ను వితరణ చేశారు. విద్యార్థుల తాగునీటి వసతి కోసం ప్రస్తుత హై స్కూల్ భవనంపై ఉన్న మినీవాటర్ ట్యాంక్ దెబ్బతినడంతో నీరు లీకేజ్ అవుతోంది.ఈ నేపథ్యంలో గ్రామస్తులు రాము,వెంకటేశ్వర్లు తదితరులు మినీవాటర్ ట్యాంక్ కోసం చెన్నైలో నివాసముంటున్న మాజీ గ్రామ సర్పంచ్ ఎత్తిరాజులు కుమారుడు రజనీకాంత్‌రె సంప్రదించారు.దీంతో సానుకూలంగా స్పందించి 2000 లీటర్ల నిల్వ సామర్థ్యం ఉన్న వాటర్ ట్యాంకును పాఠశాలకు వితరణ చేయడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు చినబాబు పేర్కొన్నారు. దీంతో ఉన్నత పాఠశాల భవనంపై కొత్త సింటెక్స్ మినీ వాటర్ ట్యాంకు ఏర్పాటు చేయడంతో ఎట్టకేలకు పాఠశాలలో విద్యార్థులకు తాగునీటి వసతి మెరుగుపడింది. కాగా వాటర్ ట్యాంక్ దాత రజనీకాంత్ తండ్రి పూర్వపు గ్రామ సర్పంచ్ కీర్తిశేషులు ఎత్తిరాజులు ఇక్కడ జడ్పీ ఉన్నత పాఠశాల భవనాన్ని ఎంతో వ్యయ ప్రయాసల కోర్చి నిర్మించడం జరిగింది.ఈ నేపథ్యంలోనే ఒక్క మదనంబేడు గాక ఇతర ప్రాంతాల నుంచి అనేకమంది విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు.

రేపు స్కిల్ నైపుణ్యం కోర్సుల్లో శిక్షణకు అర్హుల ఎంపిక

విశాలాంధ్ర- సత్యవేడు:సత్యవేడు శ్రీసిటీ నైపుణ్యాభివృద్ధి కళాశాలలో స్కిల్ నైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణ కోసం ఫిబ్రవరి 24వ తేదీన అర్హుల ఎంపిక జరుగుతుందని స్థానిక ఎంపీడీవో బాల గణేష్ పేర్కొన్నారు.జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ,సీడప్ సంయుక్తంగా నిర్వహించనున్న శిక్షణ కోర్సుల్లో అర్హులైన వారిని ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.ఇందులో భాగంగానే శ్రీసిటీ నైపుణ్య అభివృద్ధి కళాశాలలో ఫీల్డ్ ఇంజనీర్ కోర్సుకు సంబంధించి డిప్లమోలో ఎలక్ట్రికల్,ఎలక్ట్రానిక్స్ చదువుకున్న వారికి 690 గంటలు, ప్రోడక్ట్ డిజైన్ ఇంజనీర్ కోర్సుల్లో బీటెక్ చదువుకున్న వారికి 500 గంటలపాటు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ కోసం ఎప్పటికైనా వారికి ఉచిత వసతి,భోజన సదుపాయాలు జిల్లా నైపుణ అభివృద్ధి సంస్థ సమకూర్చడం జరుగుతుందన్నారు. శిక్షణకు సంబంధించి ఒక్కో కోర్సుల్లో 30 మందికి అవకాశం కల్పించనున్నట్టు ఆయన వివరించారు.ఇందుకు సంబంధించి ఫిబ్రవరి 24వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారులు ఇంటర్వ్యూలో నిర్వహిస్తారని ఆయన చెప్పారు.ఆసక్తి ఉన్న డిప్లమో,బీటెక్ చదువుకున్న యువతీ యువకులు అర్హతకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆయన కోరారు.

రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించండి

విశాలాంధ్ర -నాయుడుపేట: సూళ్లూరుపేట ఆర్డిఓ ఆర్ చంద్రమునితో సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయం నందు, బుధవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి కలిసి ఆయనను శాలువాలతో సత్కరించారు. ఈసందర్భంగా ఆయన చంద్ర మునితో మాట్లాడుతూ, నాయుడుపేట పరిసం ప్రాంతం ప్రజలు రెవెన్యూ సమస్యలతో, బాధపడుతున్నట్లు ఆసమస్యలను ఆయన దృష్టికి తీసుకుని వచ్చారు. ఈసమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డిఓ ను కోరారు. నాయుడుపేట నుంచి కృష్ణపట్నం పోర్టుకు నూతనంగా నిర్మించనున్న సాగరమాల రహదారి భూసేకరణ త్వరితగతిన పూర్తిచేసి, రైతుల అకౌంట్లో నగదు జమ చేయాలని ఆయన కోరారు.భూమిని కోల్పోతున్న రైతు పరిస్థితిని సహృదయంతో అర్థం చేసుకొని, ఆభూమికి తగ్గ విలువ ఇవ్వాలని ఆయన కోరారు. భూమి రీసర్వే కార్యక్రమాన్ని మరింత చురుకుగా నిర్వహించాలని కోరారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి: కలెక్టర్

జిల్లాలో పరిశ్రమలకు సంబంధించిన 32 క్లైములకు రూ.2.198 కోట్లు ఆమోదం

విశాలాంధ్ర - తిరుపతి: పిఎంఈజిపి రుణాలను సకాలంలో గ్రౌన్డింగ్ చేయాలని, పరిశ్రమలలో భద్రత ప్రమాణాలు అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లో జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డి.ఐ.ఈ.పి.సి). సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఉపాధి కార్యక్రమం (పి.ఎం.ఈ.జి.పి.) క్రింద కే.వి.ఐ.సి. లను సమీక్షిస్తూ లక్ష్య సాధనలో పురోగతి మెరుగుపడాలని మరియు ఎల్‌డిఎం వాటికి అనుబంధ బ్యాంకులు లోన్లు ఇచ్చేలా సత్వరమే గ్రౌండింగ్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సింగిల్ డెస్క్ విధానంలో జిల్లా ఏర్పడిన నాటి నుండి 502 పరిశ్రమలకు గాను 465 అనుమతులు ఇచ్చామని మరో 13 పరిశీలనలో ఉన్నాయని అన్నారు. పరిశ్రమల పరిశీలన కమిటీకి అందిన మేరకు 32 పరిశ్రమలకు ప్రోత్సాహకాలు రూ.2.198 కోట్లు అందించడానికి నేడు ఆమోదం తెలిపారు. పెట్టుబడి సబ్సిడీ 29, విద్యుత్ సబ్సిడీ 1, వడ్డీ రాయితీ 1, స్టాంప్ డ్యూటీ 1 యూనిట్లకు ఆమోదించారు. క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం ఏర్పేడు మండలం మధవమాల కింద వుడ్ కార్వింగ్ క్లస్టర్, కాపర్ వేజెల్స్ క్లస్టర్ ఎర్రమరెడ్డి పాలెం, రేణిగుంట మండలం, వెంకటగిరి శారీ ప్రింటింగ్ మరియు డైయింగ్ క్లస్టర్ ఏర్పాటుకు చేపట్టిన చర్యల పురోగతిపై సమీక్షించారు. జిల్లాలో పరిశ్రమలు భద్రత ప్రమాణాలు అమలు చేయాలని, ప్రమాదాల నివారణకు తరచూ సంబందిత అధికారులు సేఫ్టీ మెజర్మెంట్ పై అవగాహన కల్పించి తప్పని సరిగా అమలు చేసేలా చూడాలని ఆదేశించారు. పరిశ్రమలకు సంబందించిన అనుమతులు వివిధ శాఖల అధికారుల వద్ద ఉన్న పెండింగ్ అంశాలు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. తిరుపతి, నాయుడుపేట ఏ పి ఐ ఐ సి కి సంబంధించి మొత్తం 3 పరిశ్రమల స్థాపనకు 1.10 ఎకరాలు స్థలం కేటాయింపుకు ఆమోదంతో 3.02 కోట్ల పెట్టుబడితో ప్రారంభించబడి 73 మందికి ఉపాధి కల్పన జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తుడా విసి హరికృష్ణ, జిల్లా పరిశ్రమల అధికారి ప్రతాప్ రెడ్డి, జోనల్ మేనేజర్ ఏపిఐఐసి నాయుడుపేట చంద్రశేఖర్ , తిరుపతి సుహానా సోని, లీడ్ బ్యాంకు మేనేజర్ సుభాష్, డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామ కృష్ణ రెడ్డి, జిల్లా ఫైర్ ఆఫీసర్ రమణయ్య, కాలుష్య నియంత్రణ మండలి ఈ ఈ నరేంద్ర,వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

సోమశిల-స్వర్ణముఖి కాలువ పనులు ఏడాదిలో పూర్తి చేస్తాం

-'యువగళం'లో నారా లోకేష్

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి, ఏర్పేడు మండలాలను సస్యశ్యామలం చేసే సోమశిల-స్వర్ణముఖి అనుసంధాన కాలువ పనులను తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలో పూర్తి చేస్తామని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. నారా లోకేష్ చేపట్టిన 'యువగళం' పాదయాత్ర 24వ రోజైన బుధవారం ఏర్పేడు మండలంలో జరిగింది. మడిబాక వద్ద నారా లోకేష్ రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్ ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సోమశిల- స్వర్ణముఖి అనుసంధాన కాలువ పనులు ఆగిపోయిన విషయం నారా లోకేష్ దృష్టికి తీసుకొచ్చారు. అటవీశాఖ అనుమతులు రాక పోవడంతో ఈ పనులు ఆగిపోయాయని గుర్తు చేశారు. తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి అటవీశాఖ మంత్రిగా ఉన్న అటవీశాఖ అనుమతి తీవ్రంగా ప్రయత్నించారని... అయితే కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రాలేదన్నారు. ఈ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి... అటవీశాఖ నుంచి అనుమతులు తెప్పించి ఏడాది వ్యవధిలో పూర్తి చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ హామీతో బొజ్జల వెంకట సుధీర్ రెడ్డితో పాటు రైతులు హర్షం వ్యక్తం చేశారు.

సకల దేవతా గణాలకు వీడ్కోలు- వైభవంగా కైలాస గిరి ప్రదక్షిణ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా 10వ రోజైన బుధవారం శివ పార్వతుల గిరిప్రదక్షిణ వేడుకగా జరిగింది. తమ కల్యాణానికి విచ్చేసిన సకల దేవతా గణాలకు ఆది దంపతులు ఘనంగా వీడ్కోలు పలికి కృజ్ఞతలు తెలియచేశారు. అంతకుమునుపు గంగాభవానీ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి, జ్ఞానప్రసూనాంబ ఉత్సవమూర్తులను అలంకార మండపంలో విశేషంగా అలంకరింప చేశారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను గిరిప్రదక్షిణకు తీసుకెళ్లారు. రాజ గోపురం గుండా చతుర్మాడవీధుల్లోకి శివ పార్వతులు ప్రవేశించారు. భేరివారి మండపం వద్ద భేరి కులస్థులు ఇచ్చిన నాగవల్లిని అమ్మవారికి ధరింపచేశారు. అనంతరం జయరామరావువీధి, ఎన్టీ ఆర్ నగర్. తెలుగుగంగ కాలనీ. కైలాసగిరికాలనీ, రాజీవ్ నగర్ మీదుగా గిరి ప్రదక్షిణ జరిగింది. రామాపురం రిజర్వాయరు సమీపంలో గల అంజూరు మండపం వద్ద స్వామి, అమ్మవార్లు కొంతసేపు విశ్రమించారు. అక్కడ స్వామి, అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం కూడా చేశారు. అంజూరు మండపం నుంచి వేదాం మీదుగా శుకబ్రహ్మాశ్రమం సమీపంలోని ఎదురు సేవా మండపానికి స్వామి, అమ్మవార్లు సాయంత్రానికి చేరుకున్నారు. ఎదురు సేవా మండపం వద్ద ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు స్వామి, అమ్మవార్లకు భక్తి పూర్వకంగా స్వాగతం పలికారు. ఎదురు సేవా మండపంలో స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. అనంతరం శివపార్వతుల ఉత్సవ మూర్తులను ముక్కంటి ఆలయానికి తీసుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదనరెడ్డి, ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ కార్యనిర్వహణాధికారి కేవీసాగర్ బాబు, ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు ధ్వజావరోహణం

శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని 11వ రోజైన గురువారం ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంతో మహాశివరాత్రి ఉత్సవాలు దాదాపు ముగిసినట్లే. ధ్వజావరోహణం చేసే రాత్రిని దేవరాత్రిగా పిలుస్తారు. క్షీరసాగర మథనంలో అమృతం జనించాక దేవతలు శివ సాన్నిధ్యంలో ధ్వజావరోహణం చేసి తమ నిజ స్థానాలకు వెళతారు. ఇందులో భాగంగా ఉదయం శివ పార్వతుల ఉత్సవ మూర్తులను పురవీధుల్లో చప్పరాలపై ఊరేగించనున్నారు. ఇక రాత్రి స్వామి వారిని సింహాసనం పైనా అమ్మవారిని కామధేనువు పైనా పురవీధుల్లో ఊరేగిస్తారు.

చిన్నారుల నాట్యంతో పులకరించిన నాట్య కళా వేదిక

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తీశ్వర దేవస్థాన ఆవరణలోని దుర్జటి కళా ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఈరోజు చిన్నారి హేమాన్విత మరియు శివాగ్ని భరతనాట్య ప్రదర్శన జరిగినది. ఈ కార్యక్రమంలో అశేష భక్త జనం పాల్గొని చిన్నారుల భరతనాట్యాన్ని తిలకించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మూషిక వాహనుడు, చంద్రశేఖరం, సతులారా, గౌరీ శంకర, శ్రీమహాగణపతి మొదలైన పాటలకు చిన్నారుల హేమా న్విత,కృతి రోషిణి, భావన నృత్యంను భక్తులని ఎంతో ఆకర్షించింది. చిన్నారి నాట్య హావాభావాలతో భక్తులను భక్తపరవసమ్ములో ముంచారు. అనంతరం చిన్నారులకు దేవస్థానం తరపున ఆలయ అధికారులు చేతులమీదుగా ప్రశంస పత్రాలు అందజేశారు.

ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్టు

12ఎర్రచందనం దుంగలు, కారు, మోటారు సైకిల్ స్వాధీనం

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు మండలం తీపనూరు - మేకనూరు అటవీ ప్రాంతం పరిధిలో ఏడుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేయడంతో పాటు వీరి నుంచి 12ఎర్రచందనం దుంగలు, ఇథియోస్ లివా కారు, ఒక ద్విచక్ర వాహనాన్ని టాస్క్ ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్సు ఎస్పీ కే.చక్రవర్తి ఆదేశాల మేరకు డీఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఐ వినోద్ కుమార్ టీమ్ మంగళవారం రాత్రి గూడూరు సెక్షన్ పరిధిలో తీపనూరు-మేకనూరు రోడ్డులోని అటవీ పరిసర ప్రాంతాల్లో కూంబింగ్ చేపట్టారు. ఆ ప్రాంతంలో రోడ్డుకు పడమర వైపు ఒక కారు, మోటారు సైకిలు నిలిపి కొందరు అనుమా నాస్పదంగా ఉండడంతో వారిని సమీపించారు. పోలీసులను చూసి వారు పారిపోయే ప్రయత్నం చేయగా వారిని వెంబడించి పట్టుకు న్నారు. వీరివద్ద నుంచి 12ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసు కున్నారు. పట్టుబడిన 7గురు పుత్తూరుకు చెందిన డి.సుబ్రమ ణ్యం(60) నగరికి చెందిన ఎస్.పళనివేలు(50) ఎంజీ శేఖర్(42) గూడూరు మండలం నెల్లటూరుకు చెందిన గోర్తల కృష్ణయ్య(42) దేవిపాలెంకు చెందిన సిద్దపురెడ్డి ప్రసాద్(26) మండడి మనో హర్(57) వరదయ్యపాలెంకు చెందిన సలవారి రవి(35)లుగా గుర్తిం చి అరెస్టు చేసినట్లు తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్ లో ఏర్పా టు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఎస్ఐ మోహన్ నాయక్ కేసు విచారిస్తున్నారు. వినోద్ కుమార్ బృందాన్ని టాస్క్ ఫోర్స్ ఎస్పీ అభినందించారు.

ఆలయ పవిత్రతను దెబ్బతీస్తున్న వైసిపి

అధికార పార్టీకి శ్రీకాళహస్తీశ్వరాలయం ఎటిఎంలా మారింది
- జన సేన పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి వినుత కోటా

విశాలాంధ్ర - తొట్టంబేడు: భక్తులకు అత్యంత భక్తి ఆలయంగా ఉన్న శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయం అధికార పార్టీ వైసిపికి ఎటిఎంలా మారిందని శ్రీకాళహస్తి నియోజకవర్గం జన సేన పార్టీ ఇంఛార్జి వినుత కోటా విమర్శించారు. ఇటీవల ప్రముఖ గాయని మంగ్లీ శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో తన యూట్యూబ్ చానెల్ కోసం ఒక పాటను చిత్రీకరించడాన్ని ఖండిస్తూ శ్రీకాళహస్తి నియోజకవర్గం జన సేన పార్టీ ఇంఛార్జి వినుత కోటా బుధవారం శ్రీకాళహస్తి పట్టణంలో తమ నివాస గృహం వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికార పార్టీకి శ్రీకాళహస్తి గుడి ఒక ఏటిఎంటా అయిపోయిందని, డబ్బులు ఇస్తే సంప్రదాయాలను, కట్టుబాట్లను మంటగలిపేలా షూటింగులు చేయిస్తారా అని ప్రశ్నించారు. మంగ్లి యూట్యూబ్ చానెల్ కోసం ఆలయ ప్రతిష్టను దెబ్బ తీస్తారా? డబ్బులిస్తే గుడిని కూడా ఎవరికైనా అమ్మేస్తారా అని ధ్వజమెత్తారు. గత ఎన్నో ఏళ్లుగా ఆలయం లోపల వీడియోల చిత్రీకరణ నిషేధం ఉందని, ఇటీవల ప్రత్యేక జీ.ఓ ద్వారా ఫోన్లు నిషేధం అన్నారు. మీడియా కి సైతం గుడిలో వీడియోలు, ఫోటోలు నిషేధం అని చెప్పి, ఇప్పుడు ఏ స్వలాభం కోసం అనుమతి ఇచ్చారో తెలపాలని ప్రశ్నించారు. ఆలయం లోపల కాలభైరవుడు, స్ఫటిక లింగం, 500 రూపాయల రాహుకేతువులు పూజ మండపము, చాతుర్ మాడ వీధుల్లో , ఊంజల్ మడపం వద్ద ఎంతో పవిత్రంగా భావిస్తారని, అలాంటి ప్రదేశాల్లో కూడా సాంప్రదాయాన్ని మంటగలిపేలా నృత్యాలు చేస్తూ ఆలయ పవిత్రతను కాలరాసారని విమర్శించారు. ఏదైనా భక్తి ఛానల్ కోసం చేశారా అంటే అదీ కూడా కాదు, కేవలం వ్యక్తిగత యూట్యూబ్ చానెల్ కోసం గుడిని వాడుకుంటారా అని ప్రశ్నించారు. ఈ సంఘటన పై శ్రీకాళహస్తి ప్రజలు, శివయ్య భక్తులు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. తక్షణమే ఎమ్మెల్యే , ఎండోమెంట్ కమిషన్ వారు ప్రజలకు క్షమాపణ తెలిపి, ఆ యూట్యూబ్ చానెల్ నుండి విడియో ను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు.

విశాలాంధ్ర
తిరుపతి జిల్లా



ఎస్వీయూలో అధ్యాపక పోస్టుల భర్తీకి సిఎంకి తెలియజేయాలి

మంత్రి రోజాకు - ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు వినతి

విశాలాంధ్ర - తిరుపతి: ఎస్వీ యూనివర్సిటీ నందు ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంత్రి రోజాకు వినతిపత్రం అందజేయడం జరిగింది. మంత్రి రోజా తో ఏఐఎస్ఎఫ్ నాయకుడు చిన్న మాట్లాడుతూ శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ కేటాయించిన రెగ్యులర్ పోస్టుల 572 ఉండగా ఎప్పటికప్పుడు అధ్యాపకులు ఉద్యోగ విరమణ చేస్తుండడంతో శాశ్వత అధ్యాపకుల సంఖ్య 167 కు చేరింది .యూనివర్సిటీ ఆర్ట్స్ సైన్స్ కలిపి మొత్తం 54 విభాగాలు ఉన్నాయి. 167 మంది విభాగాధిపతులుగా ప్రత్యేక విధుల్లో ఉంటారు. దీంతో విభాగాల బోధన చక్కదిద్దే పరిస్థితి లేదు. కొన్నేళ్ల నుంచి కూడా అకాడమిక్ కన్సల్టెంట్, గెస్ట్ ఫ్యాకల్టీచేసిన వారిని నియమించుకుని బోధన రంగాన్ని నెట్టుకొ స్తున్నారు. ఒకప్పుడు యూనివర్సిటీ పరిశోధన రంగంగా విరాజిల్లింది. కోట్ల రూపాయలు నిధులు తీసుకొచ్చి ప్రాజెక్టులు నిర్వహించేవారు. ప్రస్తుతం 167 మంది శాశ్వత అధ్యాపకులు ఈ ఏడాది జులై నాటికి 30 మంది ఉద్యోగ విరమణ చేస్తున్నారు. తక్షణమే ముఖ్య మంత్రి తో చర్చించి ఖాళీగా ఉన్న ఆధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ అధ్యక్షుడు సుందర్, టెక్నికల్ వింగ్ కార్యదర్శి చంద్ర నాయకులు గిరి, వంశీ పాల్గొన్నారు.

ఎస్టీ జాబితాలో బిసి వాల్మీకి బోయ కులాలను చేర్చే అంశంపై ఏక సభ్య కమిషన్

విశాలాంధ్ర - తిరుపతి: తిరుపతి జిల్లా ఆర్టీవో ఆఫీస్ నందు చర్చ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో శివశంకర్ నాయక్ మాట్లాడుతూ 75 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో ఇప్పటికీ ఎస్టీ గిరిజన ఎరుకుల యానాది చెంచు బంజారా ప్రజలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారని ప్రతి తండా ఏజెన్సీ ప్రాంతాల్లో సరైన సౌకర్యాలు లేవని ఈ సమాజంలో ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న ఎస్టీ జాబితాలో ఆర్థికంగా రాజకీయంగా సామాజికంగా అభివృద్ధి చెందిన బిసి బోయ వాల్మీకులాలను చేర్చడం అన్యాయమని ఏ ప్రభుత్వాలు అయినా ఓటు బ్యాంకు కోసమే అన్నదమ్ములుగా ఉన్నటువంటి బిసి ఎస్టి కులాలను గొడవలు పెట్టడం తగదని పేర్కొన్నారు పక్క రాష్ట్రమైనటువంటి తెలంగాణ రాష్ట్రంలో ఎస్టీ రిజర్వేషన్ 12 శాతాన్ని పెంచి అభివృద్ధి చేశారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రిజర్వేషన్లు పెంచకపోవడం పోగా ఎస్టీ జాబితాలో ఇతరులను చేర్చడం హీనమైన చర్యను పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో జిల్లాలోని గిరిజన బీసీ బోయ వాల్మీకి నాయకులు అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవం

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి : స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకుడు బేడన్ పావెల్ జన్మదినోత్సవాన్ని శ్రీకాళహస్తిలో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. శ్రీ ప్రసన్న వరదరాజ స్వామి వారి ఆలయ ప్రాంగణంలో బేడన్ పావెల్ చిత్ర పటం వద్ద ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం సన్నిధి వీధిలోని కంచి కామకోటి పీఠం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, బిస్కెట్లు, రొట్టెలు, పేస్ట్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్కౌట్స్ రాష్ట్ర మండలి సభ్యులు టి. రమేష్ బాబు, రోవర్ లీడర్ ఉమేష్ రావు మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకులు బేడన్ పావెల్ స్ఫూర్తితో శ్రీకాళహస్తిలో మరిన్ని సేవా కార్యక్రమాలలో పాల్గొనాలని స్కౌట్స్ అండ్ గైడ్స్ కు విద్యతో పాటు సేవాభావాన్ని కూడా అలవరుచుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఉన్నత పాఠశాల పిడి నిర్మల, బావన, స్కౌట్ మాస్టర్ ఎస్ కె. అజారిద్దీన్, లీడర్లు సుబ్రమణ్యం, వెంకీ, చందు, విద్యాసాగర్ స్కౌట్స్ అండ్ గైడ్స్ పాల్గొన్నారు.

చీటి డబ్బులు ఇవ్వలేదని వ్యక్తి ఆత్మహత్య

అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకుడు,ఆయన భార్య పై కేసు నమోదు

ఆలస్యంగా వెలుగుచూసిన సంఘటన



విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : చీటి డబ్బులు ఇవ్వకుండా ఏళ్ల తరబడి వేధిస్తున్న చీటి నిర్వాహకులు తీరుతో మనస్తాపం చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు పంచాయతీ ఎస్వీపి కాలనీ లో చోటు చేసుకుంది.తిరుచానూరు పంచాయతీ ఎస్వీపి కాలనీ కి చెందిన నితిన్ సింగ్ స్థానికంగా ప్రొవిజన్ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు.ఈ క్రమంలో తన అవసరాల నిమిత్తం ఇంటి పరిసరాల్లో నమ్మకంగా చీటిలు నిర్వహిస్తున్న వాణి, ఆమె భర్త ప్రతాప్ స్వామి అలియాస్ బాబు స్వామి(అమ్మవారి ఆలయం ప్రధాన అర్చకులు) వద్ద పెద్ద మొత్తంలో చీటీలు వేసాడు. చీటీ గడువు ముగిసి మూడేళ్లు గడుస్తున్నా తనకు రావాలిసిన డబ్బులు ఇవ్వకుండా దంపతులు ఇద్దరు రోజుకో మాట చెబుతుండేవారు.దీంతో అడిగి అడిగి విసిగి వేసారిన నితిన్ మనస్తాపం చెంది తన చావుకు కారణం చీటి నిర్వహిస్తున్న దంపతులే కారణమంటూ లేఖ రాసి తన ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మ హత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు సోమవారం తిరుచానూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు.

అంగరంగ వైభవంగా ప్రారంభమైన మహాకుంబాభిషేకమహెూత్సవాలు

ప్రారంభ పూజల్లో వేమిరెడ్డి దంపతులు - లక్షకుంకుమార్చనలు ఆరంభం

విశాలాంధ్ర - సూళ్లూరుపేట : సూళ్లూరుపేటలో వెలసి ఉన్న శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయం లో నూతన స్వర్ణ విమాన గోపుర శిఖర ప్రతిష్ట మరియు మహా కుంభాభిషేకం మహెూత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభించారు, ఈ వేడు కల్లో ముందుగా అమ్మణ్ణికి ప్రత్యేక అభిషేకాలు చేశారు, పట్టు వస్త్రాల తో పుష్పాలతో అలంకారం చేశారు, ఈ వేడుకల ఉభయదాతలు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి,ప్రశాంతి దంపతులు ఈ మహెూత్స వాలలో పాల్గొన్నారు,బంగారు తాపడం తో సిద్ధం చేసిన శిఖర కలిశాలను ముందుగా ఆలయం లో ప్రదక్షణ చేసి అమ్మణ్ణి పాదాల చెంత ఉంచి పూజలు చేశారు, అనంతరం గణపతి పూజ చేసి మహెూత్సవాలు ప్రారంభించారు. ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్ర రెడ్డి దంపతులు ఆళ్ళ శ్రీనివాసులు రెడ్డి దంపతులు లక్ష కుంకుమ పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు,అనంతరం ఆలయ గోపురాల పై ప్రతిష్ట చేయనున్న 16 స్వర్ణ గోపుర శిఖర కలిశాలను పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవం చేశారు. ఈ వేడుకల్లో ఆలయ ట్రస్ట్ సభ్యులు ముప్పాళ్ల చంద్రశేఖర్ రెడ్డి,వంకా దినేష్,బండి సునీత,ఓలేటి బాల సత్యనారాయణ, మన్నెముద్దు పద్మజ,నాయుడు కుప్పం నాగమణి,పెనుబేటి మారెమ్మ ,ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి, మునిసిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి,కళత్తూరు రామ్మోహన్ రెడ్డి,కళత్తూరు జనార్దన్ రెడ్డి,దువ్వూరు గోపాల్ రెడ్డి,జెట్టి వేణు యాదవ్,కౌన్సిలర్ మిజూరు రామకృష్ణ రెడ్డి, మారంరెడ్డి మునీష్ రెడ్డి, ఆంజనేయ స్వామి ఆలయ చైర్మన్ ఐతా శ్రీధర్,గోగుల తిరుపాల్, అలవల సురేష్,దేవేంద్ర రెడ్డి పాల్గొన్నారు.